# సుబ్బారావు! బుద్ధారావు!!

కొలుపూరి త్రిమూర్తి సత్యనారాయణ



"నిజం వెంకూ! మీ అత్త' మీద ఒట్టు! నన్ను నమ్ము!

నాకింకేం చెప్పొద్దు – మీ అసలు స్వరూపం ఇప్పుడు తెలిసింది! ఇంకొక క్షణం కూడా ఇక్కడ వుండను!

"అది కాదు

ఏం చెప్పొద్దు – నేను వెళ్తున్నా!

ఇప్పుడు మీ ఊరికి బస్ లేదు

బస్ లేకపోతే – విమానం మీద వెళ్తాను!

నువ్వు వెళ్ళిపోతే నేను బ్రతకలేను వెంకూ?

ఏం నాటకంలోదీ డైలాగ్?

ఖర్మరా భగవంతుడా? నేను నాటకాల్లో వేషాలు వేసినంత మాత్రాన – ఏం మాట్లాడినా నీకు నాటకాల్లో డైలాగుల్లా వుంటున్నాయా? అసలు నా బాధను అర్థం చేసుకోవేమిటి? నా మాట విను – అంతగా వెళ్ళాలనుకుంటే రేపు వెళ్ళువుగాని రేపు సాయంత్రం అయిదు గంటలగ్గాని మీ ఊరు వెళ్ళే బస్‌లేదు

ఇక చేసేది లేక బట్టలు సర్దుకున్న సూట్‌కేస్‌ను విసురుగా క్రిందపడేసి – గబగబా లోపలకు వెళ్ళి మంచంమీద బోర్లా పడుకొని ఏడుస్తోంది సత్యవతి

కుర్చీలో కూర్చొని జుట్టు పీక్కోబోయాను – బాదనిపించి మానేశాను

ఆఫీసునుంచి మల్లెపూలతో ఎంతో హుషారుగా వచ్చి, గుమ్మంలో అడుగు పెట్టబోతున్న నన్ను – అప్పుచేసి, ఎగ్గొట్టేసి తప్పించుకు తిరుగుతున్న అప్పుల్రావుని కాలర్ పట్టుకొని నిలేసినట్లు మా శ్రీమతి –

శకుంతల ఎవరు? అని అడిగింది

దుష్యంతుడి భార్య!' అన్నాను నవ్వుతూ

ఆ దుష్యంత మహారాజు తమరేనా?

నే నే నేనా? నేనేమిటి వెంకట సత్యవతి ఎందుకలా గుచ్చి గుచ్చి అడుగుతుందో అర్థం కాలేదు నాకు

శకుంతలా, మీరు ప్రేమించుకున్నారట పెళ్ళి కూడా చేసుకుంటా నన్నారట చాన్నాళ్ళనుంచి ఉత్తరాలు రాసుకుంటున్నారట మీరు ఆఫీసుకి వెళ్ళగానే వచ్చింది! స్వగ్రామంనుంచి ఏదో పనిమీద ఈ ఊరు వచ్చి, మిమ్మల్ని చూద్దామని వచ్చిందట ఎన్నాళ్ళనుంచీ రాకపోకలు? చెప్పు మావయ్యా? నన్నెందుకిలా మోసం చేశావ్? ఆ వగలాడినే కట్టుకోక పోయావా? ."

"నామాట నమ్ము! ఆ శకుంతల ఎవరో నిజంగా నాకు తెలియదు!"

ఎంత బాగా నటిస్తున్నావ్ మావయ్యా? పరిషత్ నాటకాల్లో నటిస్తే నీకు తప్పకుండా బెస్ట్ యాక్టర్ ఖాయం!

ఈ ఆడవాళ్లకి అనుమానం రాకూడదు వచ్చిందా - మనశ్శాంతి లేకుండా చేస్తారు!

★ ★ ★

ఉద్యోగం పురుష లక్షణం! ఆ లక్షణం నాలో కనిపించాక మా అక్క కూతురు వెంకట సత్యవతితో నా పెళ్లి జరిపించారు

పెళ్లయి వారం రోజులయిందో లేదో – మూఢం ఆ పైన ఆషాఢం అని – వెంకట సత్యవతిని పుట్టింటికి నన్ను ఆఎసుక పొమ్మన్నారు అంతే గాకుండా ఆషాఢం వెళ్లేవరకూ ఒకరి ముఖాలు ఒకరు చూడకూడదని ఆర్డినెన్స్ జారీ చేశారు పెద్ద-వాళ్ళు

పట్టుమని ఏడు రాత్రులు గడిపామో లేదో – ఇంతలో ఎంత ఎడబాటు?!

ఆషాఢం ముందు పెళ్లెందుకు చేశారు? ఆ తరువాతే చేయకపోయారా? అని పెద్దవాళ్ల మీద విరుచుకు పడ్డాను

ప్రక్కకు తిరిగి ముసిముసిగా నవ్వుకున్నారు నా బాధ వాళ్లకేం తెలుసు? ఈ పెద్ద వాళ్లందర్నీ ఎండలో వరుసగా నిలబెట్టి యినుపకడ్డీ ఎర్రగా కాల్చి వాతలు పెట్టాలన్నంత కసిగా వుంది నాకు!

ఒకరాత్రి, ఒక పగలు కాదు – ఒక రోజు రెండు-రోజులు కాదు – రెండునెలలు! భగవాన్! ఎంత ఘోరమ్మైన శిక్ష విధించావ్?

విరహ వేదనతో బారెడు గెడ్డం పెంచేసి, బీరు-బాటిల్ పట్టుకొని విరహగీతాలు పాడుకుంటూ వీధుల్లో పడదామనుకున్నాను కాని మా మేనేజరు సెలవివ్వనన్నాడు!

ఆ రెండు నెలలు ఇరవై ఏళ్ళుగా గడిచాయి నాకు

ఓ శుభ ముహూర్తాన మా నానొచ్చి – ఆషాఢం వెళ్లిపోయింది – వచ్చే బుధవారం మంచిది – వెళ్లి అమ్మాయిని తీసుకొచ్చి కాపురం పెట్టు! ఈ కటకటాల గది కాకుండా ఇంకో మంచి యిల్లు అద్దెకు తీసుకో! అన్నాడు

టీ కని బ్లాకులో కొన్న కేజీ పంచదారలో ఓ గుప్పెడు తీసుకొచ్చి మా నాన్న నోట్లో పోశాను

వెలమపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని వెంకట సత్యవతిని తీసుకొచ్చి, కొత్త కాపురం పెట్టి మూడు రోజులయిందో లేదో, అప్పుడే కలతలు

ఆ రాత్రి ఉపవాసం మల్లె పూలు నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతున్నట్లనిపించింది!

★ ★ ★

ఆ మర్నాడు ఆఫీసుకి శలవు పెట్టి, ఇంటి దగ్గరే వున్నాను – కోపంలో వెంకట సత్యవతి ఏ అఘా-యిత్యానికి పాల్పడుతుందోనని భయం వేసి!

ఉదయం పదకొండు గంటలయింది

వెంకట సత్యవతి ఇంకా అలకపాన్పు దిగలేదు – ప్రభుత్వ సహాయం అందని వరద బాధితుడిలా దిగులుగా కుర్చీలో కూర్చున్నాను నేను

ఇంతలో తలుపు చప్పుడైతే వెళ్లి తీశాను

ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి,

నమస్కారం!" చేతులు జోడించాడతను

లోపలకొచ్చి కూర్చోండి!" అన్నాను

అతను లోపల కొచ్చి కుర్చీలో కూర్చుని –

నా పేరు సుబ్బారావు! ఇంతకు ముందు ఇదే ఇంట్లో అద్దెకి వుండేవాడ్ని ఈ యింటి అడ్రస్‌కి లెటర్స్ ఏమైనా వచ్చాయో తీసుకువెళ్దామని వచ్చాను అన్నాడు

ఇంతలో బయటనుండి – పోస్ట్! అన్నకేక వినిపించింది

అతను బయటకు వెళ్లి – ఏవో పుస్తకాలతో డబ్బు లెక్కపెట్టుకుంటూ తిరిగి ఇంట్లోకి వచ్చాడు

నేను కార్టూనిస్టుని! యివిగో నా కార్టూన్లు ప్రచురింపబడిన పత్రికలు – కాంప్లిమెంటరీ కాపీలు! ఇంతకు ముందు ప్రచురించబడిన కార్టూన్లకి పారితోషికం యిదీ! "

అని డబ్బు జేబులో పెట్టుకొని –

నేను యిల్లు మారినట్టు ఆ యింటి అడ్రస్ పోస్టుమేన్‌కి యిప్పుడే చెప్పాను ఒకవేళ పొర-బాటున యిక్కడ వేస్తే లెటర్స్ వుంచండి – ఎప్పు-డైనా వచ్చి తీసుకు వెళ్తాను! " అన్నాడతను

నాకు చటుక్కున ఓ ఆలోచన తట్టింది!

మీకు శకుంతల తెలుసా? అని అడిగాను

నా హృదయ సామ్రాజ్ఞి నా కలల రాణి – వచ్చిందా యిక్కడికి? ,

వచ్చి, మా కొత్త కాపురంలో కలతలు పెట్టి వెళ్లిపోయింది!

నేను యిల్లు మారినట్టు ఆమెకు లెటర్ రాయా-లనుకుంటూనే మర్చిపోయాను!

మా కొంప ముంచావ్! నిన్న నేను ఆఫీసుకి వెళ్లాక – మీ శకుంతల వచ్చి - సుబ్బారావు-గారున్నారా? అని మా ఆవిడ్ని అడిగిందట లేరు – ఆఫీసుకు వెళ్లారు " అని మా ఆవిడ చెప్పింది

'మీరెవరు?" అని శకుంతల అడిగితే – నేను సుబ్బారావుగారి పెళ్లాన్నని" మా ఆవిడ చెప్తే – "నన్ను ప్రేమించి, మిమ్మల్ని పెళ్లి చేసు-కుంటారా? ఎంత మోసం! దగా! అని ఏడుస్తూ వెళ్లిపోయిందట! " అన్నాను

ఇంతకీ మీ పేరు?" అడిగాడతను

"తమరి నామదేయమే – నా నామధేయం! అక్కసుగా అన్నాను

"కొంప ముంచారు! నాకు నిజంగా పెళ్లయి పోయిందేమోనని – అక్కడ నా శకు ఏ అఘా-యిత్యం చేసుకుందో ఏమో – వస్తాం! గుమ్మం వైపు పరిగెత్తబోయాడతను

గబుక్కున అతని రెక్కపట్టుకొని ఆపి –

"ఆగు నాయనా! ముందు మా కొంప తేల్చు – ఆ తరువాత నీ కొంప గురించి ఆలోచిద్దువుగాని వెంకూ! వెంకూ! " మా ఆవిడ్ని పిలిచాను

వచ్చింది వెంకట సత్యవతి

చెప్పవయ్యా! చెప్పు! జరిగిందంతా మా వెంకూకి చెప్పు! అన్నాను –వెంకట సత్యవతికి నామీద వున్న అనుమానం పోగొట్టాలని నా తాప-త్రయం!

"అంతా విన్నానండి! " తల వాల్చుకొని చెప్పింది వెంకట సత్యవతి

"క్షమించండి! నావల్ల మీకు చాలా ట్రబుల్ కలిగింది వస్తానండి! " అని వెళ్లిపోయా-డతను

వెంకట సత్యవతి నన్ను వాటేసుకుంది – ఆ పగలే వెన్నెల రాత్రిలా తీయగా – హాయిగా గడిచిపోయింది మాకు! □

ఇటీవల లయన్స్ క్లబ్ (విజయవాడ), లయనెస్ క్లబ్, లియో క్లబ్బుల సంయుక్త సమావేశంలో న్యూరో సైకి యాట్రిస్టు, హిప్నో థెరపిస్టు డాక్టర్ నిచ్చెనమెట్ల అశోక్ కుమార్ హిప్నాటిజం గూర్చి ప్రసంగించారు వేదికపై ఆశీనులైన వారిలో లయనెస్ శ్రీమతి టి చాముండేశ్వరిమూర్తి (సెక్రటరీ), లయనెస్ శ్రీమతి యస్ శ్రీమణి కృష్ణమూర్తి (ప్రెసిడెంట్),లయన్ శ్రీ జి యస్ ఆర్ ప్రసాద్, (ప్రెసిడెంట్),లయన్ శ్రీ కె రవి (సెక్రటరీ) గార్లని చిత్రంలో చూడవచ్చు

